బలగం BALAGAM TV

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 29 జనవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## నాగోబా జాతర శుభాకాంక్షలు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆసియాలోనే రెండో అతిపెద్ద ఆదివాసి వేడుక అయిన నాగోబా జాతర సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్త్రభాకాం క్షలు తెలిపారు. వనమే ఆలంబనగా అత్యం త నియమ నిష్టలతో ఆదివాసీలం దరూ జరుపుకునే వేడుక నాగోబా జాతర అని, గిరిజన సోదర, సోదరీమణుల ందరికీ శుభాకాంక్షలు అంటూ పేర్కొ న్నారు. పుష్య అమావాస్య నాడు ఆదిలా బాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూ ర్‌లో అంబరాన్నంటే ఈ ఆదివాసీ సంబు రం తెలంగాణ సాంస్కృతిక వైభవ మని పేర్కొన్నారు. దేశంలో రెండో అతి పెద్ద ఆదివాసీ వేడుకలో ఆధ్యాత్మక వెలుగులు నింపే ఆదిశేషువు కరుణాకటాక్షాలు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు.

## నాగోబా జాతర ప్రారంభం



**బలగం టీవీ, ఆదిలాబాద్ బ్యూరో**

ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా మహాజాతర పుష్యమాస అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం రాత్రి 11గంటలకు మహాపూజల నిర్వహ ణతో ప్రారంభమైంది.ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో మెస్రం వంశీయులు మంగళవారం నాగోబా జాతర పూజలను ప్రారంభించారు. గంగా జలాన్ని, ఆలయ ప్రాంగణంలోని మురాడి వద్దకు మెస్రం వంశీయులు తీసుకొచ్చారు. గ్రామంలోని పాత ఆలయం నుంచి నాగోబా విగ్రహాన్ని ఊరేగింపుగా గర్భగుడిలో భద్రపరి చారు. అనంతరం ఆలయ సమీపంలోని కోనేరు నుంచి కొత్త కుండల్లో నీళ్ల తెచ్చి పుట్టని చేసి పూజ ప్రారంభించడంతో ఈ జాతర ఘనంగా ప్రారంభమైంది కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు మెస్రం వంశీయులు పాల్గొన్నారు. ఐదు రోజులపాటు జరిగే జాతరలో తెలుగు రాష్ట్రాల నుంచి కాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతారు.

# ప్రభుత్వానికి స్పష్టమైన విధానం

## అందుకే పెట్టుబడులొచ్చాయ్

- దావోస్ పర్యటనలో తెలంగాణకు రూ.1.80 లక్షల కోట్లు పెట్టుబడులు
- పెట్టుబడులన్నీ పారదర్శకమే
- అటెన్షన్ సీకింగ్ డిజార్డర్ జబ్బుతో బాధపడుతున్న వారు పరిశీలించుకోవచ్చు.
- వేలాది ఉద్యోగాలు వస్తాయి
- ప్రభుత్వ కృషి వల్లే పెట్టుబడులు
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానం, నిర్దిష్టమైన ప్రణాళిక కలిగి ఉన్న కారణంగా ప్రపంచ అగ్రశ్రేణి కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకంతో పెట్టుబడులు పెట్టడం ద్వారా వ్యాపార విస్తరణతో పాటు ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడానికి ముందుకొచ్చిన సంస్థలకు ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. సింగపూర్‌తో పాటు ప్రపంచ ఆర్థిక సదస్సు దావోస్ వేదికగా పెట్టుబడులకు సంబంధించి కుదిరిన ఒప్పందాలపై ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మీడియాకు వివరించారు. ముఖ్యమంత్రితో దావోస్ పర్యటనలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడి, ధనసరి సీతక్క, పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి మాట్లాడారు.

"ఓపెన్ యాక్సెస్ విధానంతో తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన ఎనర్జీ పాలసీతో పెట్టుబడులను ఆకర్షించగలిగాం. డేటా సెంటర్లకు సంబంధించిన వాటిల్లోనే లక్ష కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు సంస్థలు ముందుకొచ్చాయి. సాధారణంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే విధి విధానాలను బట్టి పెట్టుబడులు వస్తాయి. పెట్టుబడులకు అవసరమైన అనుమతుల విషయంలో తీసుకొచ్చిన సరళీకృత విధానాల వల్ల పెట్టుబడులతో ముందుకొచ్చారు. దాదాపు 1 లక్షా 80 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులను రాష్ట్ర ప్రభుత్వం ఆకర్షించింది.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 13 నెలల కాలంలో ఇప్పటివరకు సాధించిన విజయాల్లో ఈ పెట్టుబడుల సాధన విజయమే అత్యంత కీలకమైంది. కొందరు తెలంగాణ ప్రభుత్వం మీద, హైదరాబాద్ నగరంలో పెట్టుబడుల మీద అపోహలు, అనుమానాలు సృష్టిస్తూ విషప్రచారం చేస్తున్నారు. తద్వారా పెట్టుబడులను అడ్డుకోవాలని, రాష్ట్ర ఆర్థిక మూలాలను దెబ్బతీయాలను కుట్రలు పన్నారు. ఆయా కంపెనీలు తెలంగాణ ప్రభుత్వం పట్ల సంపూర్ణమైన విశ్వాసం ప్రకటించడంతో వారి కుట్రలు విఫలమయ్యాయి.

పెట్టుబడులకు వేగంగా అనుమతులు మంజూరు చేయడంతో పాటు అవసరమైన చోట భూ కేటాయింపులు గానీ, పరిపాలన అనుమతులు ఇవ్వడం ద్వారా గానీ ఆ సంస్థలను ప్రోత్సహిస్తాం. ఆ సంస్థల పెట్టుబడుల ద్వారా రాబోయే కాలంలో తెలంగాణ సమాజానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందివ్వాలన్న ఆలోచన ప్రభుత్వానిది.తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. భవిష్యత్తులో అత్యధిక ఆదాయం కలిగిన రాష్ట్రంగా మారాలి. వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీకి తీసుకెళ్లాలని నిరంతరం కృషి చేస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం.

దావోస్ పర్యటనే కాకుండా సింగపూర్ ప్రభుత్వంతో కూడా స్కిల్స్ డెవలప్‌మెంట్‌లో ఒప్పందం చేసుకున్నాం. అది భవిష్యత్తులో మన సాంకేతిక నైపుణ్యాన్ని వేగంగా పెంపొందించడానికి ఉపయోగపడుతుంది. ఇవన్నీ కూడా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు.

అమెజాన్, సన్ పెట్రోకెమికల్స్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్ సీఎల్... ఇలా అనేక ప్రముఖ సంస్థలు ఒప్పందాలు చేసుకుంటే కొందరు లేకితనంతో అజ్ఞానంతో మాట్లాడుతున్నారు. ఆయా కంపెనీలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై ఎవరైనా వెరిఫై చేసుకోవచ్చు. తెలంగాణకు పెట్టుబడులు వస్తున్నప్పుడు స్వాగతించడానికి ఇష్టం లేనివారు మౌనంగా ఉండండి. ఏ ఏ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నామో జాబితా, ఫోటోలు అన్నీ బహిరంగంగానే ఉన్నాయి. అటెన్షన్ సీకింగ్ డిజార్డర్ జబ్బుతో బాధపడుతున్న వారు చెబుతున్నది నిజమా. ప్రభుత్వం చెబుతున్నది నిజమా పరిశీలించుకోవచ్చు. కీలకమైన ఈ నిర్ణయాలను యువతకు ముఖ్యంగా ప్రజలకు చేరవేయాల్సిన, చేరవేస్తున్న మీడియాకు ధన్యవాదాలు" అని ముఖ్యమంత్రి తెలియజేశారు.

## ఆ ఎన్నికలవ్వగానే రైతు భరోసా బంద్



- కోమటిరెడ్డికి దమ్ముంటే ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి
- పోరాటాల పురిటి గడ్డ నల్లగొండ మళ్లీ రైతుల తిరుగుబాటుకు వేదిక కావాలి
- రుణమాఫీ, రైతుబంధు, బోనస్ అన్నీ బోగస్
- నల్లగొండ నుంచి కాంగ్రెస్ వ్యతిరేక పోరాటం ప్రారంభం.
- కాంగ్రెసోళ్లు మళ్లీ ఓట్ల కోసం వస్తారు నిలదీయండి
- నల్లగొండ బీఆర్ఎస్ రైతు మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, నల్గొండ బ్యూరో**

స్థానిక సంస్థల ఎన్నికలు ముగియగానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను నిలిపివేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్ లో బీఆర్ఎస్ నిర్వహించిన రైతు మహాధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

కేసీఆర్ హయాంలో 11 విడతలుగా రైతుబంధు పథకం కింద రైతుల అకౌంట్లలో రూ. 73 వేల కోట్లను వేసినట్లు గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ అంటే వైఎస్ఆర్ అని, రైతుబంధు అంటే కేసీఆర్ అని గుర్తొస్తారని చెప్పారు. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారని, ఆ కుట్రలో భాగంగానే కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని బందు చేయాలని యత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15000 ఇస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎకరానికి రూ. 12000 మాత్రమే ఇస్తానని మోసం చేస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కొక్క ఎకరానికి రూ. 17,500 బాకీ ఉందని, ఆ డబ్బు చెల్లించాలని కాంగ్రెస్‌ను రైతులు నిలదీయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు అన్నీ బందయితయని కేసీఆర్ ఆనాడే ప్రతి సభలో చెప్పిండ్రు. ఆయన చెప్పినట్టే ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు రైతుబంధు ఇస్తలేరు. పార్లమెంట్ ఎన్నికల ముందు ఒక్కసారి రైతుబంధుగా ఏసిండు. అది కూడా అంతకు ముందే మనం దాచిపెట్టిన పైసలే. కేసీఆర్ హయాంలో నాట్లప్పుడు రైతుబంధు పడేది. కానీ రేవంత్ పాలనలో ఓట్లప్పుడు మాత్రమే రైతుబంధు పడుతది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు వస్తున్నయ్. అందుకే మళ్లీ కొత్త డ్రామా ఆడుతున్నడు. జనవరి 26 నుంచి మార్చి 31 వరకు రైతుబంధు పైసలు పడుతయట. మరి ఏ సంవత్సరం మార్చి నెలనో చెప్పలేదు' అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు.

సాయుధ తెలంగాణ పోరాటంలో నల్లగొండ జిల్లా కీలక పాత్ర పోషించిందని, రైతు సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు మరోసారి నల్లగొండ జిల్లా వేదికగా మారాలని అన్నారు.

మిగితా 2వ పేజీలో

## 30న కేంద్ర క్యాబినెట్ సమావేశం

- 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ భేటీ
- తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం
- ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

వివరాలు 2వ పేజీలో

## ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరాపై కమిటీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక సరఫరా విధానంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక ఉన్నతస్థాయి అధ్యయన కమిటీని నియమించారు. ఈ కమిటీ వారం రోజుల్లోగా తమ అధ్యయనాన్ని పూర్తి చేసి సమగ్ర విధివిధానాలతో నివేదిక అందించాలని ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, టీజీ ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్‌తో కమిటీని నియమించారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా.. గనుల శాఖపై ముఖ్యమంత్రి సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించనున్న నేపథ్యంలో లబ్ధిదారులకు సౌకర్యంగా ఇసుక విధానం ఉండాలన్నారు. రాష్ట్రంలో ఏటేటా నిర్మాణాలు పెరుగుతున్నా ఇసుక నుంచి ప్రభుత్వానికి ఆదాయం ఆశించినంత రావడం లేదని, అదే సమయంలో వినియోగదారులు ఎక్కువ ధరకే ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోందని అన్నారు.

వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక దక్కేలా చూడాలని.. అదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం పెరిగేలా చూడాలని సూచించారు. ఇసుక మాఫియాను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. మేజర్, మైనర్ ఖనిజాల గనులకు వేసిన జరిమానాలు వసూళ్లు కాకపోవడంపైనా అధికారులను సీఎం ప్రశ్నించారు. మేజర్, మైనర్ ఖనిజ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేసి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని అధ్యయన కమిటీని సీఎం ఆదేశించారు.

## ఎక్స్‌పీరియం పార్క్ ప్రారంభం



- టెంపుల్, హెల్త్ ఏకో టూరిజానికి ప్రాధాన్యత
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఎక్స్‌పీరియమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీ నటులు చిరంజీవి, పద్మశ్రీ వనజీవి రామయ్య

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో టెంపుల్ టూరిజం, హెల్త్ టూరిజం, ఎకో టూరిజం రంగాలు అభివృద్ధి చెందడానికి రాబోయే కొద్ది రోజుల్లో ఒక విధానం ప్రకటిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. ఐటీ, ఫార్మా, మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలతో పాటు టూరిజం రంగాలు రాష్ట్రంలో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని అభివృద్ధి చేస్తే ఆదాయాన్ని పెంచుకోవడమే కాకుండా రాష్ట్రానికి ఒక గుర్తింపు, గౌరవాన్ని తెస్తాయని అన్నారు. రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ దేవస్థానం మార్గంలోని ప్రొద్దుటూరు గ్రామంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకున్న ఎక్స్‌పీరియం పార్క్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు.మంత్రి జూపల్లి కృష్ణారావు , కేంద్ర మాజీ మంత్రి, సినీ నటుడు చిరంజీవి , ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , సీఎం రమేశ్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి , ఎమ్మెల్యేలు కాలె యాదయ్య , మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ వనజీవి రామయ్య దంపతులను, దుశ్చర్ల సత్యనారాయణలసత్కరించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "రాష్ట్రంలో విద్యార్థినీ విద్యార్థులందరూ తమ తల్లి పేరుతో ఒక్కొక్క మొక్కను నాటి సంరక్షించేలా కేంద్రం తీసుకున్న Ek Ped Maa Ke Naam కార్యక్రమం తరహాలో ప్రభుత్వం త్వరలోనే ఒక విధానం తీసుకొస్తుంది. తెలంగాణలో సహజ వనరులు ఉన్నా ప్రభుత్వాలు ఇప్పటివరకు హెల్త్, ఎకో, టెంపుల్ టూరిజం రంగాలపై దృష్టి సారించలేదు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అద్భుతమైన ఆలయాలు ఉన్నప్పటికీ టెంపుల్ టూరిజం అభివృద్ధి చెందలేదు.

దేవాలయాలను దర్శించుకోవాలంటే తమిళనాడుకు లేదా ఇతర రాష్ట్రాలకు, ప్రకృతి సంపద, సహజ వనరులను చూడాలంటే మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలకు, హెల్త్ టూరిజంలో మరెక్కడికో వెళుతున్న పరిస్థితులు ఉన్నాయి.కవాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కావొచ్చు, నల్లమల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కావొచ్చు, కొల్లాపూర్ అటవీ ప్రాంతంలో కృష్ణా నదీ జలాలు ప్రవహిస్తున్న ప్రాంతం గానీ, అక్కడ మందిరాలు.. ప్రకృతి సహజ వనరులకు కొదవ లేదు. వాటికి ఇవ్వాల్సినంత ప్రాధాన్యతను ఇవ్వలేదు. వికారాబాద్ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతోనే దావోస్‌లో ఒక సంస్థతో ఒప్పందం చేసుకోవడం ద్వారా ప్రభుత్వం ఒక అడుగు ముందుకువేసింది. ఎక్స్‌పీరియం పార్క్‌ను నిర్మించిన రామ్‌దేవ్ రావుని అభినందిస్తూ, ఇది ఏడాది, ఏడాదిన్నర తర్వాత ఒక అద్భుతమైన పర్యాటక క్షేత్రంగా మారుతుంది. తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి సాధించడానికి ప్రాతిపదికగా మారుతుంది." అని అన్నారు.

## సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ




- 15 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం
- 60 మందితో రాష్ట్ర కమిటీ
- కొత్తగా ఏడుగురికి చోటు
- ఆహ్వానితులుగా ఏడుగురు
- ప్రత్యేక ఆహ్వానితులుగా ఐదుగురు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన దళిత నేత జాన్‌వెస్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ నూతన రాష్ట్ర కమిటీ 60 మందితో ఏర్పడింది. అందులో 15 మంది రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్రకమిటీకి ఆహ్వానితులుగా ఏడుగురు, ప్రత్యేక ఆహ్వానితులుగా ఐదుగురిని ఎన్నుకున్నారు. సంగారెడ్డి

సీపీఐ(ఎం) రాష్ట్ర చరిత్రలో తొలిసారి ఒక దళితుడ్ని రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్షుడిగా జాన్ వెస్లీ పని చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం నియమితు లయ్యారు. తర్వాత జరిగిన రెండు మహాసభల్లోనూ ఆయన తిరిగి ఎన్నికయ్యారు. తాజాగా సంగారెడ్డిలో జరిగిన మూడో మహాసభల్లో జాన్ వెస్లీని మహాసభలకు హాజరైన ప్రతినిధులు ఎన్నుకున్నారు.

రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా జి.నాగయ్య, ఎస్.వీరయ్య, పోతినేని సుదర్శన్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, టీ.జ్యోతి, చుక్క రాములు, పాలడుగు భాస్కర్, టీ.సాగర్, మల్లు లక్ష్మి, ఎండీ అబ్బాస్, పి.ప్రభాకర్, నున్న నాగేశ్వరరావు, బండారు రవికుమార్, ఎండీ జహంగీర్‌లను మహాసభ ఎన్నుకుంది. ఈ సభల్లో రాష్ట్ర ప్రముఖులతో పాటు జాతీయ నేతలు కూడా పాలొన్నారు. అయితే ఈ సందర్భంగా ఆ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. 70 ఏళ్లు దాటిన నేతలకు పార్టీ రాష్ట్ర కమిటీ నుంచి ఉద్వాసన కల్పించింది. దీంతో వయసు రీత్యా రాష్ట్ర కమిటీ నుంచి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్సీ సీతారాములు, నర్సింగ్ రావులు స్వచ్ఛదంగా తప్పుకున్నట్లు సమాచారం.

## సీఎం ప్రెస్‌మీట్ అట్టర్ ఫ్లాప్

- మీ ఈనో స్టోరీలు ఎవరూ నమ్మడం లేదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్ ఎలా ఉందంటే.. పెట్టుబడుల కట్టు కథను నమ్మించేందుకు శత విధాలా ప్రయత్నించి అట్టర్ ఫ్లాప్ అయినట్లు ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మీ ప్రెస్ రిలీజులు, మీ మీడియా కవరేజులు, మీ ఈనో స్టోరీలు ఎవరూ నమ్మడం లేదని చివరకు ప్రెస్‌మీట్ పెట్టావు అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఎప్పుడో అయిపోయిన దావోస్‌కు ఇప్పుడు ఎందుకు ఈ దావతు. దావోస్‌లో జరిగే ఎంవోయూలు అన్నీ కూడా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ మాత్రమే, ఎవరైనా ఓపెన్ టెండర్‌లో రావాల్సిందే.. అని ఆర్థిక మంత్రి భట్టి గారు అంటే, మీరేమో లక్షా 82 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చినట్లు గప్పాలు చెబుతున్నారు. భట్టి గారు చెప్పింది నిజమా? మీ మాటలు నిజమా? రేవంత్ రెడ్డి గారూ.. అని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. పొంతన లేకుండా మీరు చెప్పిన కంపెనీలు, పెట్టుబడుల లెక్కలు యావత్ తెలంగాణ ప్రజానీకం గమనించింది. అంతా డొల్ల ప్రచారం అని తేలిపోయింది. రైతు భరోసా కోసం గంపెడు ఆశతో, కొండంత ఆందోళనతో ఎదురుచూస్తున్న రైతుల ఆరాటాన్ని చిల్లర పంచాయితీ అంటవా? ఇంతక ముందు రైతు బంధును బిచ్చం అన్నవు, ఇప్పుడు రైతు భరోసాను చిల్లర పంచాయతీ అంటున్నవు. సంక్రాంతికి ఇస్తానన్న సంగతి తేలిపోయింది, చబ్బీస్ (26) జనవరి చేదు మాత్రనే అయ్యింది, ఇప్పుడు మార్చి 31 దాకా గడువు పెంచినవు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

జర్నలిస్టులు ఇదేమని అడిగితే, చిల్లర పంచాయితీ అంటున్నవు. అప్పుల పాలవుతున్న రైతుల ఆవేదన పక్కన పెట్టి మీ ప్రచారం వినాలా? రైతుల అప్పులు ముఖ్యమా.? దావోస్ డప్పులు ముఖ్యమా..? మీ సెల్ఫ్ డబ్బాకు, మీ వెకిలి సెటైర్లకు కాలం చెల్లింది. ఇకనైనా కళ్ళు తెరువు రేవంత్ రెడ్డి. నీలో అటెన్షన్ డిక్రీసింగ్ డిజార్డర్ మొదలైంది. నీ మాటలు ఎవరు నమ్మడం లేదనే ఆందోళన పెరిగిపోయింది. మంచి మానసిక వైద్యుడిని సంప్రదించడం మంచిది అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచించారు.

## ఇలాంటి హత్య కేసు ఇప్పటి వరకు చూడ లేదు

- నిందితుడిలో కనపడని పశ్చాత్తాపం
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- మీర్‌పేట్ హత్య కేసుపై సీపీ ప్రెస్‌మీట్

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మీర్‌పేట హత్య కేసులో నిందితుడు గురుమూర్తిని పోలీసులు మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రాచకొండ సీపీ సుధీర్ బాబు మీడియాకు వెల్లడించారు. ఒక మనిషిని ఇంత క్రూరంగా చంపుతారా.. మేమే నివ్వెరపోయామని సీపీ అన్నారు. భార్యను ఇంత దారణంగా చంపిన గురుమూర్తిలో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించలేదన్నారు.

బాలాపూర్ మండలంలోని జిల్లెల గూడలో నివాసం ఉంటున్న పుట్ట వెంకట మాధవి, గురుమూర్తి దంపతులు. వారికి ఇద్దరు సంతానం. మాధవి స్వస్థలం ప్రకాశం జిల్లా.రాచర్ల మండలం, జెల్లీ వారి పుల్లెల చెరువు గ్రామం. గురుమూర్తి ఆర్మీలో 15 సంవత్సరాలుగా జవాన్‌గా పనిచేసి, అనంతరం ప్రయివేటు సెక్యూరిటి గార్డ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 15న సంక్రాంతికి బాలాపూర్ మండల పరిధిలో ఉండే మాధవి బంధువుల ఇంటికి పిల్లలు, భర్తతో కలిసి వెళ్లారు. పిల్లలను అక్కడే వదిలేసిన భార్యాభర్తలు తిరిగి ఇంటికి

మిగితా 2వ పేజీలో

## రౌడి షీటర్ మోయిజ్‌పై ఆరు నెలల జిల్లా బహిష్కరణ...



- సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ

**బలగం టీవీ , సిరిసిల్ల**

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 11 కేసుల్లో నిందుతుడిగా ఉంటూ చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతు ప్రజా శాంతికి ఇబ్బందులు కలిగుస్తున్న రౌడి షీటర్ మహమ్మద్ మోయీస్ పాషా ఏ మోయిజ్‌ను జిల్లా నుండి ఆరు నెలలు బహిష్కరించడం జరిగిందని, జిల్లాలో ఎక్కడైనా కనపడితే పోలీస్ వారికి సమాచారం అందించాలని పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణం సుభాష్ నగర్ కి చెందిన మహమ్మద్ మోయీస్ పాషా ఏ మోయిజ్ పై సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో 11(హత్య, హత్యాయత్నం, ఏ ఆర్ ఎం ఎస్ యాక్ట్ బెదిరింపులకు పాల్పడిన,యూట్యూబ్ చానల్ వేదికగా వ్యక్తిని విచక్షణారహితంగా కొట్టడం మొదలగు కేసులల్లో నిందుతునిగా ఉన్నడని అన్నారు. రౌడి షీటర్ చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతు ప్రజా శాంతికి,సామాన్య ప్రజానీకానికి ఇబ్బం దులు కలిగిస్తూన్నాడన్న వస్తున్న పిర్యాదుల మేరకు అతనిపై తెలంగాణా సామాజిక వ్యతిరేక మరియు ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం కింద, 1980 ప్రకారం జిల్లా నుండి ఆరు నెలల పాటుగా బహిష్కరించడం జరిగిందని అన్నారు.జిల్లాలో ఎక్కడైనా కనపడితే అతని సమాచారం పోలీస్ వారికి అందించాలని, జిల్లాలో అసాంఘిక ,చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజా శాంతికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

## గల్ఫ్ బాధితుడికి చేయూతనందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో క్షేమంగా స్వదేశానికి అంజి

**బలగం టీవీ , సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన మెరుగు అంజి గత సంవత్సరం క్రితం బొంబాయి ఆఫీసులో బతుకుదెరువు కొరకు డ్రైవరు వీసాపై లక్ష యాభై వేల రూపాయలు ఆఫీసుకు నింపి సౌదికి వెళ్ళగా,అక్కడ వెళ్లిన తర్వాత ఐదు నెలల నుండి జీతం ఇవ్వకుండా పని చేయించుకుని సరైన టైం కు అన్నం పెట్టకుండా పాస్పోర్టు లాక్కొని నానా ఇబ్బందులు పెడుతూ డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వకుండా అక్కడి కంపెనీ వారు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తనను కపడాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని,ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది



శ్రీనివాస్ ని వేడుకుంటూ వీడియో విడుదల చేయగా విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించి అంజి ని తిరిగి స్వదేశానికి రప్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇండియన్ ఎంబసీ,సౌదీ అరేబియా దేశానికి లేఖ రాసి అధికారులతో మాట్లాడారు.. సౌదీలో ఉన్న ఎన్నారై బైర దేవ్ యాదవ్ ను అంజి ఆచూకీ తెలుసుకొని తెలుపగా వెంటనే బైర దేవ్ యాదవ్ అంజి ఆచూకీ కనుక్కొని తన రూం లో ఐదు నెలలు ఉంచుకుని అంజి పాస్ పోర్ట్ కంపెనీవారు ఇవ్వకపోవడంతో నూతన పాస్పోర్ట్ ,వీసా తయారు చేసి, టిక్కెట్ కొని ఏర్పాట్లు పూర్తవడంతో అంజి జనవరి 27 నాడు బయలుదేరి నేడు జనవరి 28 నాడు స్వగ్రామం కొలనూరు కు క్షేమంగా చేరుకోవడం జరిగింది.. కాగ వీడియో చూసి స్పందించి క్షేమంగా ఇంటికి వచ్చేలా ఏర్పాటు చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు, ఐదు నెలలు తన రూమ్ లో ఉంచుకొని కంటికి రెప్పలా కాపాడిన బైరా దేవ్ యాదవ్ కి అంజి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు..

## పొంగులేటిని కలిసిన మండెపల్లి భూ బాధితులు

- ఏండ్లుగా పోరాటం.. బాధితులకు అండగా సీపీఐ

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్ లో రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు సుద్దాల ప్రభాకర్ మరియు మండెపల్లి గ్రామానికి చెందిన భూమిని కోల్పోయిన బాధితులందరు కలిసి కలిశారు. తంగళ్ళపల్లి మండలంలోని మండెపల్లి గ్రామంలో 377 సర్వే నెంబర్ లో 120 కుటుంబాలకు చెందిన దాదాపు 350 ఎకరాల భూమిని తీసుకొని నష్ట పరిహారము అందించలేదని ఉపాధి అవకాశాలు లేక భూములు కోల్పోయి కుటుంబాలు జీవనోపాధి లేక



చితికిపోతున్నారని 2013 భూ సేకరణ చట్టం ప్రకారంగా భూములు గనుక ప్రభుత్వం తీసుకుంటే అట్టి భూములకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని చట్టంలో ఉన్నప్పటికీ గత ప్రభుత్వాలు అన్యాయం చేశాయని బాధితులకు అండగా ప్రభుత్వం నిలవాలని పొంగులేటికీ వినతిపత్రం అందజేస్తూ తెలిపారు.



## బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని మండెపల్లి గ్రామంలోని మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. గద్దర్ తన భావాజాలంతో పేదల కోసం కృషి చేశారని,బడుగు బలహీన వర్గాల కోసం గోసి, గొంగడి కట్టి నిరంతరం పాట ద్వారా సమాజా అభ్యున్నతికై పాటుపడ్డారని మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు యాస సందీప్ అన్నారు. అలాంటి తెలంగాణ పోరాట యోధుడు గద్దర్ పై ఎంపీ బండి సంజయ్ అనుచిత వాక్యాలు మాట్లాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం సభ్యులు నక్క రవి, నక్క నరేష్, యాస మధు,కుమార్,రాజేష్, అనుక్, శివ, అనిల్, సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్.ఎఫ్.ఐ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మంద అనిల్ కుమార్
- బోయినిపల్లి మండలంలోని మోడల్ పాఠశాల కళాశాల ముందు ఫిబ్రవరి 5,6 తేదీల్లో ఎస్ఎఫ్ఐ 4వ మహాసభలు.. కళాశాల విద్యార్థులతో కరపత్రం ఆవిష్కరణ




**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 5,6 తేదీలలో జరిగే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాలుగో మహాసభలకు సంబంధించిన కరపత్రాలు స్థానిక బోయినిపల్లి మండలంలోని మోడల్ స్కూల్ కళాశాలలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మంద అనిల్ కుమార్ మాట్లాడుతూ: జిల్లాలో విద్యార్థుల సమస్యలపై నిరంతరం ఉద్యమాలు పోరాటాలు చేస్తున్న ఏకైక సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ, విద్యార్థుల పక్షాన నిలబడుతూ, వారి సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడుతుందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని,ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న విద్యార్థుల సమస్యలు పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి కేటాయించకపోవడం సిగ్గుచేటని అన్నారు.వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, మండలంలోని మోడల్ స్కూల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, జిల్లా మండలంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి,భవిష్యత్తులో విద్యారంగ అభివృద్ధి కొరకు నూతన కర్తవ్యాలు,తీర్మానాలు రూపొందించుకొని,జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి నాలుగవ ఎస్ఎఫ్ఐ మహాసభలు ఉపయోగపడతాయని అన్నారు.ఈ మహ సభలను జిల్లాలో విద్యార్థులు, మేధావులు, ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర రాకేష్, మండల నూతన కార్యదర్శి బుర్ర ఉదయ్, అధ్యక్షులు గుండ్ల ఆర్యన్, కళాశాల అధ్యక్ష కార్యదర్శులు చేపూరి భార్గవరామ్, కాసారం శ్రీనాథ్, రమ్య, శృతి, భార్గవి, సంధ్య, విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.



## సొంత గూటికి చేరిన అంజనీకుమార్

- చల్మెడ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిక...

**బలగం టీవీ , వేములవాడ**

వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, సీనియర్ నాయకులు దొంతుల అంజనీకుమార్ తిరిగి తన సొంత పార్టీ బిఆర్ఎస్ పార్టీలోకి మంగళవారం చేరారు. బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మినరసింహారావు చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకొని బీఆర్ఎస్ పార్టీ లోకి చేరారు.నాలుగు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ లోకి చేరిన అంజనీ కుమార్ మళ్ళీ తన సొంత పార్టీ బి ఆర్ ఎస్ పార్టీ లోకి చేరారు. ఈ సందర్భంగా ఆంజనీ కుమార్ మాట్లాడుతూ కాంగెస్ పార్టీ పరిస్థితి తాను పార్టీ లో చేరిన 4 రోజులకే అర్ధమైంది అన్నారు. రానున్న రోజుల్లో అభివృద్ధి కేవలం బిఆర్ఎస్ పార్టీ తోనే సాధ్యమైని నమ్మి పార్టీ లోకి చేరానని తెలిపారు

# తెలంగాణ అమ్మాయి అదుర్స్

**53 బంతుల్లో సెంచరీ చేసిన త్రిష గొంగడి**

**మహిళల అండర్-19 ప్రపంచకప్‌లో స్కాట్లాండ్‌పై భారత్ విజయం**



**బలగం టీవీ, హైదరాబాద్**

అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో తెలంగాణలోని భద్రాచలంకు చెందిన త్రిష గొంగడి అదుర్స్ అనిపించింది. కేవలం 53 బంతుల్లో సెంచరీ చేసి అదరగొట్టింది. మంగళవారం స్కాట్‌లాం డ్‌తో జరిగిన సూపర్ సిక్స్ మ్యాచ్‌లో అజేయ సెంచరీ సాధించి రికార్డును నెలకొల్పింది. వుమెన్స్ అండర్-19 ప్రపంచ కప్‌లో సెంచరీ సాధించిన తొలి వుమెన్స్ క్రికెటర్‌గా నిలిచింది. అంతేకాకుండా బౌలింగ్‌లోనూ మూడు వికెట్లు పడగొట్టింది.ఇక త్రిష అద్భుత ప్రదర్శనతో భారత్ ఈ మ్యాచ్‌లో తో 150 పరుగుల తేడాతో గెలుపొందింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోర్ చేసింది. త్రిష(59 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110 నాటౌట్)తో పాటు మరో ఓపెనర్ కమలిని(42 బంతుల్లో 9 ఫోర్లతో 51) హాఫ్ సెంచరీతో రాణించగా.. సనికా చాల్కే(20 బంతుల్లో 5 ఫోర్లతో 29 నాటౌట్) మెరుపులు మెరిపించింది. అనంతరం స్కాట్లాండ్ 14 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు పిప్పా(12), వాల్‌సింగమ్(12), పిప్పా స్ప్రోల్(11) మాత్రమే డబుల్ డిజిట్ స్కోర్లు చేయగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో శుక్ల 4 వికెట్లు తీయగా.. వైష్ణవి శర్మ, త్రిష తలో మూడు వికెట్లు తీసారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన త్రిషకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ దక్కింది. ఈ టోర్నీలో ఇప్పటికే భారత్ సెమీఫైనల్ చేరింది. జనవరి 31న సెమీఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

ఈ మ్యాచ్‌లో 53 బంతుల్లోనే త్రిష సెంచరీ సాధించింది. దాంతో అండర్ 19 టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే సెంచరీ నమోదు చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డ్ సృష్టించింది. అలాగే టీమిండియా 208 పరుగుల భారీ స్కోర్ చేసింది. అండర్ 19 టీ20ల్లోనే ఇది రికార్డ్ స్కోర్. మరో ఓపెనర్ కమలినితో కలిసి త్రిష తొలి వికెట్‌కు 147 పరుగుల రికార్డ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.

# ఐసీసీ మహిళా క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా మెలీ కెర్




**బలగం టీవీ, హైదరాబాద్**

న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ మెలీ కెర్‌ను.. ఐసీసీ వుమెన్స్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించింది. ప్రతిష్టాత్మకమైన రేచల్ హేహెూ ఫ్లింట్ ట్రోఫీకి ఆమె ఎంపికైంది. 2024లో అసాధారణ మహిళా క్రికెటర్‌గా ఆమె రికార్డుకెక్కింది. రేచెల్ హేహెూ ఫ్లింట్ ట్రోఫీకి మొదటి కివీస్ గ్రహీతగా మంగళవారం చరిత్ర సృష్టించింది.

24 ఏళ్ల ఆమె తన తోటివారిలో ప్రత్యేకంగా నిలిచింది, లారా వోల్వార్ట్, చమరి అతపత్తు, అన్నాబెల్ సదర్లాండ్‌లను అధిగమించి మహిళా క్రికెట్‌లో అత్యున్నత గౌరవాన్ని పొందింది. ఆమె ఏడాది పొడవునా, కెర్ ప్రపంచ స్థాయి ఆల్-రౌండర్‌గా తన నైపుణ్యాన్ని ప్రదర్శించింది, ఆటలోని ప్రతి అంశంలోనూ రాణిస్తోంది. ఆమె అత్యుత్తమ ఫీల్డింగ్ న్యూజిలాండ్‌ను పదే పదే ఎత్తివేసింది, అయితే లెగ్ స్పిన్నర్‌గా ఆమె నైపుణ్యం ఆమెను ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన స్ట్రైక్ బౌలర్‌లలో ఒకరిగా నిలబెట్టింది. కెర్ తరచుగా వైట్ ఫెర్న్స్ బంతితో మ్యాచ్-విజేతగా ఉండేవాడు.

బ్యాట్‌తో, ఆమె న్యూజిలాండ్ లైనప్‌కు మూలస్తంభంగా ఉంది, బలమైన ప్రారంభాలను ఉపయోగించుకోవడానికి లేదా టాప్ ఆర్డర్ తడబడినప్పుడు ఇన్నింగ్స్‌ను ఎంకరేజ్ చేయడానికి విస్తారమైన ఇన్నింగ్స్‌లను ఆడగల సామర్థ్యం కలిగి ఉంది.

రేచల్ హేహెూ ఫ్లింట్ ట్రోఫీ అవార్డును 2017 నుంచి ప్రకటిస్తున్నారు. ఎలిసీ పెర్రీ(ఆస్ట్రేలియా), స్మృతి మందాన(ఇండియా), స్కీవర్ బ్రుంట్(ఇంగ్లండ్) ఇప్పటి వరకు ఈ అవార్డును గెలుచుకున్నారు.

# భారత్ విజయాలకు బ్రేక్..!

- మూడో టీ20లో ఇంగ్లాండ్ విజయం
- హార్దిక్ పాండ్య ఒంటరి పోరాటం వృధా






**బలగం టీవీ, రాజ్‌కోట్**

భారత్, ఇంగ్లండ్ మధ్య గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో మంగళవారం రాత్రి జరిగిన మూడో టీ-20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు 26 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలుచుకున్న టీం ఇండియా



బౌలింగ్ ఎంచుకుంది.అనంతరం ఇంగ్లండ్ విధించిన 172 పరుగుల లక్ష్యాన్ని చేధించ డటంలో టీం ఇండియా బ్యాటర్లు విఫల మయ్యారు.

ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులు చేసింది. బెన్ డకెట్(28 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీతో రాణించగా.. లియామ్ లివింగ్‌స్టోన్(24 బంతుల్లో ఫోర్, 5 సిక్స్‌లతో 43) ధాటిగా ఆడాడు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి(5/24) ఐదు వికెట్లతో సత్తా చాటగా.. హార్దిక్ పాండ్యా(2/24) రెండు వికెట్లు పడగొట్టాడు. రవి బిష్ణోయ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసారు.అనంతరం భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 146 పరుగులు చేసి ఓటమిపాలైంది. భారత బ్యాటర్లలో హార్దిక్ పాండ్యా (35 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 40), అభిషేక్ శర్మ(14 బంతుల్లో 5 ఫోర్లతో 24) మినహా అంతా విఫలమయ్యారు. సంజూ శాంసన్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లోనే క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆర్చర్ వేసిన షాట్ పిచ్ బాల్‌ను భారీ షాట్ ఆడే క్రమంలో సంజూ(3) వికెట్ పారేసుకున్నాడు. క్రీజులోకి సూర్యకుమార్ యాదవ్ రాగా.. అభిషేక్ శర్మ దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు.ఐదు బౌండరీలతో జోరు కనబర్చాడు. కానీ అతన్ని బ్రైడన్ కార్స్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. తిలక్ వర్మ 18, అక్షర్ పటేల్ 15 పరుగులు చేశారు. తర్వాత ధృవ్ జురెల్, మహ్మద్ షమీ బ్యాట్ ఝుళిపించినా ఉపయోగం లేకపోయింది. నిర్దేశిత 20 ఓవర్లకు టీం ఇండియా తొమ్మిది వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్ రెండేసి వికెట్లు, జామీ ఓవర్టన్ మూడు వికెట్లు తీశారు.ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 1-2తో నిలిచింది.

# ఢిల్లీ జట్టుతో కలిసి ప్రాక్టీస్‌లో పాల్గొన్న కోహ్లీ



**బలగం టీవీ, హైదరాబాద్**

విరాట్ కోహ్లీ దేశవాళీ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. అందుబాటులో ఉన్న అంతర్జాతీయ క్రికెటర్లంతా దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ నయా రూల్ తీసుకురావడంతో ఇప్పటికే స్టార్ ఆటగాళ్లంతా రంజీ ట్రోఫీలోకి రీఎంట్రీ ఇచ్చారు. ఇప్పటికే కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు యశస్వి జైశ్వాల్, రిషభ్ పంత్, శుభమన్ గిల్ రంజీ ట్రోఫీలోకి రీఎంట్రీ ఇచ్చారు. మెడ నొప్పి కారణంగా కోహ్లీ రీఎంట్రీ ఆలస్యమైంది. ప్రస్తుతం కోలుకున్న కోహ్లీ.. ఢిల్లీ తరపున రైల్వేస్‌తో గురువారం నుంచి ప్రారంభమయ్యే మ్యాచ్‌లో బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్ కోసం ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ జట్టును ప్రకటించగా.. ఆ టీమ్‌లో విరాట్ కోహ్లీ ఉన్నాడు. ఇప్పటికే కోహ్లీ.. టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ పర్యవేక్షణలో ముంబైలోని అలీబాగ్‌లో ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేశాడు. స్క్వేర్ ఆఫ్ ది వికెట్ షాట్లను బాదడంతో పాటు బ్యాక్‌ఫుట్‌పై ఆడడంపై ఫుల్ ఫోకస్ పెట్టాడు. ముఖ్యంగా ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీల బలహీనతను అధిగమించడంపై బంగర్‌తో కలిసి వర్క్ చేశాడు.

ఢిల్లీ జట్టుతో కలిసి కూడా ప్రాక్టీస్‌లో పాల్గొన్నాడు. కుర్రాళ్లతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడాడు. 13 ఏళ్ల తర్వాత కోహ్లీ రంజీ ట్రోఫీ బరిలోకి దిగడంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక జియో సినిమా ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా ప్రసారం చేస్తామని ప్రకటించింది. జియో సినిమా, స్పోర్ట్స్ 18లో ఈ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం కానుంది. జియో సినిమాలో ఉచితంగా ఈ మ్యాచ్ చూడవచ్చు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానం వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌ను ఉచితంగా చూసే అవకాశాన్ని డీడీసీఏ ప్రేక్షకులకు కల్పించింది. ఎలాంటి టికెట్లు లేకుండానే ఈ మ్యాచ్‌ను ఫ్రీగా చూడవచ్చు.

# తండేల్ ట్రైలర్ విడుదల



నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు . ఫిబ్రవరి 7న ఈ చిత్రం విడుదల కానుంది. కాగా ఈ నేపథ్యంలో, ట్రైలర్‌ను ఈరోజు వైజాగ్‌లో విడుదల చేశారు మేకర్స్. 'ప్రమాదం అని తెలిసిన తన మంది కోసం ముందుకు అడుగేసినోడే తండేల్', 'తండేల్ అంటే ఓనరా..?', ' కాదు లీడర్' లాంటి పవర్‌ఫుల్ డైలాగులతో తండేల్ ట్రైలర్ రిలీజైంది.

శ్రీకాకుళం మత్స్యకార కుటుంబంలో జరిగిన కథ అధారంగా ఈ సినిమా తీస్తున్నారు. 2018లో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా రానుంది. శ్రీకాకుళం సాంస్కృతిక, సామాజిక అంశాలతో పాటు మత్స్యకారుల జీవితాలు ఎలా ఉంటాయో ఈ సినిమాలో చూపించనున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాజు అనే జాలరి పొరపాటుగా పాకిస్థాన్ సముద్రజలాల్లోకి ప్రవేశించాడు. దీంతో పాక్ నేవి అధికారులు అరెస్ట్ చేస్తుంది. ఈ ఘటనను ఆధారం చేసుకుని తండేల్ చిత్రాన్ని నిర్మించారు. ఆ జాలరిని తిరిగి భారత్‌కు రప్పించేందుకు తన ప్రియురాలు చేసిన పోరాటం ఏంటో ఈ సినిమాలో చూడొచ్చు.